క్లుప్తంగా

శాంతియుత జీవనానికే ప్రజల మొగ్గు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న న్యాయవాది శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: అల్లర్లు, ఘర్షణలు లేని శాంతియుత జీవనానికే ప్రజలు మొగ్గు చూపుతారని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ శాంతి దినోత్సవం పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యాయవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశాలు, జాతులు, సమూహాల మధ్య తీవ్ర ఘర్షణలు నెలకొన్నాయని అంతర్జాతీయ కాల్పుల విరమణ, అహింస, శాంతి, సోదర భావాల సాధన శాంతి దినోత్సవం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం సొసైటీలో విచారణ

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలోని సొసైటీలో సహకార శాఖ అధికారులు బృందం శనివారం విచారణ చేపట్టింది. సొసైటీ సీఈఓపై ఆ గ్రామానికి చెందిన పుల్ల శ్రీరాములు(శ్రీను) ఫిర్యాదు చేయడంతో సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్లు గణేష్, రవికుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమాశంకర్‌లను వివరాలు సేకరించారు. సొసైటీలో ఇద్దరిని ఉద్యోగులుగా నియమించారని, రైతులకు రాయితీలు సక్రమంగా చెల్లించలేదు తదితర ఆరోపణలపై స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఇన్‌స్పెక్టారు గణేష్ మాట్లాడుతూ ఫిర్యాదు మేరకు విచారణకు వచ్చామని తొలుత ఫిర్యాదుదారుడు శ్రీనివాసరావు నుంచి వాంగ్మూలం నమోదు చేసుకున్నామన్నారు. తర్వాత సీఈఓను విచారిస్తామన్నారు.

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటి): కాకినాడ అర్బన్ మండల పరిధిలో స్థానిక జిల్లా క్రీడా మైదానంలో శనివారం జరిగిన పాఠశాల క్రీడా సమాఖ్య ఎంపికల్లో స్థానిక రామారావుపేట నారాయణ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనపరిచారని ప్రిన్సిపాల్ షర్మిల శనివారం తెలిపారు. ఈ ఎంపికల్లో తాజ్‌అబ్దుల్ చెస్ విభాగంలో ప్రథమ స్థానం, పి.నవీన్ లాంగ్‌జంప్‌లో మూడో స్థానం, డిస్కస్త్రోలో మొదటి స్థానం సాధించి జిల్లాస్థాయి ఎంపికలకు ఎంపికయ్యారన్నారు. నికేష్‌రాజు బ్యాడ్మింటన్‌లో మూడోస్థానం, రహమత్ నాలుగో స్థానం పొందారని పేర్కొన్నారు. పీఈటీ సతీష్‌ను, జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను నారాయణ పాఠశాల ఏజీఎం రాఘవేంద్రరావు, జోనల్ కోఆర్డినేటర్ మూర్తి, ప్రిన్సిపాల్ షర్మిల అభినందించారు.

ముమ్మిడివరం కమిషనర్‌గా రవివర్మ

కాకినాడ: ముమ్మిడివరం మున్సిపల్ కమిషనర్‌గా పి.రవివర్మ నియమితులయ్యారు. ఈ మేరకు పురపరిపాలన శాఖ నుంచి శనివారం ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఆయన కాకినాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. గతంలో కూడా పి.రవివర్మ ముమ్మిడివరం కమిషనర్‌గా పనిచేశారు.

భారీ అన్నదానం

బోట్‌క్లబ్: స్థానిక టూటౌన్ సమీపంలోని మునసబువీధిలో గణపతి యువబాల భక్త బృందం ఆధ్వర్యంలో గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తబృందం చైర్మన్ తలాటం హరీష్ మాట్లాడుతూ గత 37 సంవత్సరాలుగా గణపతి నవరాత్ర ఉత్సవాలు నిర్వహించి, ముగింపు సందర్భంగా భారీ అన్నదానం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఫౌండర్ సానా సతీష్ ఆర్థిక సహాయంతో అన్నదానం నిర్వహించినట్టు చెప్పారు. భక్త బృందం సభ్యులు డి గోవిందరావు, తలాటం కల్యాణచక్రవర్తి, శ్రీను, మణికంఠ కృష్ణవేణి పాల్గొన్నారు.

కార్పొరేషన్‌పై క్లాప్ పిడుగు

- ప్రతి ఏడాది రూ.7 కోట్ల అదనపు భారం
- బకాయిలు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- నిధులు ఇవ్వకుండా తప్పించుకున్న వైనం
- నగరపాలక సంస్థకు గడ్డు పరిస్థితి

కాకినాడ: క్లీన్ ఆంధ్రప్రదేశ్ పథకంలో ఏర్పాటు చేసిన హూపర్ టిప్పర్ వాహనాల నిర్వహణ బాధ్యతను కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలపై పడేసింది. పట్టణాలు, నగర ప్రాంతాలను శుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పథకం ద్వారా హూపర్ టిప్పర్ వాహనాలను కొనుగోలు చేశారు. ఒక్క కాకినాడ సిటీ నియోజకవర్గానికి వంద వాహనాలను సమకూర్చి వాటి నిర్వహణ బాధ్యతను ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఈ వాహనాల ద్వారా ఇంటింటికీ వెళ్లి తడి–పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వాటిని ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాలకు తరలించి ఆదాయం సమకూరేలా చక్కని ప్రణాళికతో ముందుకు వెళ్లారు. వీటి నిర్వహణకు అయ్యే ఖర్చును యూజర్ చార్జీల రూపంలో ప్రజల నుంచి వసూలు చేసి వాటిని కాంట్రాక్టర్‌కు ఇచ్చేవారు.

చెత్త పన్ను పేరుతో నిర్వీర్యం

సమర్థవంతంగా నడుస్తున్న ఈ విధానానికి టీడీపీ, జనసేన పార్టీలు చెత్త పన్ను పేరు పెట్టి గత ప్రభుత్వ హయాంలో రాద్ధాంతం చేశారు. దీంతో కొన్ని నెలలుగా యూజర్ చార్జీల వసూళ్లు పూర్తిగా నిలిపివేశారు. ఈ క్రమంలో కాంట్రాక్టర్‌కు బకాయిలు పేరుకుపోవడంతో సుమారు నెల రోజులుగా హూపర్ టిప్పర్ వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.



హూపర్ టిప్పర్ వాహనాలు

ప్రతి నెలా రూ.57లక్షలు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికే వీరి బకాయి రూ.3.30 కోట్లకు చేరిపోయింది. దీంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు.

చెత్తంతా కలిపేయడంతో..

క్లాప్ వాహనాలు నిలిచిపోవడంతో సుమారు 20 రోజులుగా తడి–పొడి చెత్త సేకరణ మొక్కుబడిగా సాగుతోంది. అందుబాటులో ఉన్న పుష్‌క్యాట్‌లతో చెత్త అంతా వేరుచేయకుండా ఇవ్వడంతో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కూడా సమస్యగా మారింది. నగరంలోని అనేక ప్రాంతాల్లోను బహుళ అంతస్తుల భవనాల నుంచి చెత్త సేకరణలో ఏర్పడ్డ సమస్య నగరపాలక సంస్థలకు సమస్యాత్మకంగా తయారైంది.

చేతులెత్తేసిన ప్రభుత్వం

ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే చెత్త పన్నులను రద్దు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం సమస్య తీవ్రతతో ఇప్పుడు తలలు పట్టుకుంది. ప్రజల నుంచి యూజర్ చార్జీలు వసూళులు చేస్తే తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉండడంతో ఆ ప్రతిపాదనను పక్కన పెట్టి మొత్తం భారాన్ని కార్పొరేషన్‌పై నెట్టేసింది. ఇప్పటి వరకూ చెల్లించాల్సిన రూ.3.50 కోట్లు నగరపాలక సంస్థే సాధారణ నిధుల నుంచి చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసి చేతులు దులుపేసుకుంది. ఇప్పటికే అరకొర సేవలతో ఇబ్బందులు పడుతున్న నగరపాలక సంస్థకు రూ.3.50 కోట్ల పాత బకాయితోపాటు ఏటా అదనంగా రూ.7 కోట్లు భరించాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్యకు పరిష్కారం చూపించాల్సిన ప్రభుత్వం ఆ భారాన్ని తమపైనే వేయడాన్ని స్థానిక సంస్థలు జీర్ణించుకోలేకపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మంచి విధానాన్ని కొనసాగించాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తే ఆ భారాన్ని స్థానిక సంస్థలపై నెట్టడం మాత్రం విమర్శలకు తావిస్తోంది.

ప్రభుత్వమే భరించాలి



క్లాప్ వాహనాల నిర్వహణ భారం ప్రభుత్వమే భరించాలి. నగరపాలక సంస్థపై భారం పడకుండా అందుకు అవసరమైన నిధులు కేటాయించాలి. ముఖ్యంగా క్లాప్ వాహన డ్రైవర్లకు కనీస వేతనాలు, వారాంతపు సెలవులు, ఇతర సదుపాయాలను అమలు చేయాలి.

– పలివెల వీరబాబు, గౌరవాధ్యక్షుడు, క్లాప్ వాహన డ్రైవర్ల సంఘం

భారం వేయడం సరికాదు



చెత్త పన్ను రద్దు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ భారాన్ని నగరపాలక సంస్థలపై రుద్దడం సరికాదు. నగరపాలక సంస్థ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రతి నెలా అరకోటికి పైగా అదనపు ఖర్చును భరించడం సాధ్యమయ్యే పని కాదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇందుకోసం ప్రత్యేక నిధులు విడుదల చేయాలి. లేదంటే ఇటువంటి సేవల కోసం వసూళ్లు చేస్తున్న ఆస్తి పన్నును మానుకోవాలి.

– దూసర్లపూడి రమణరాజు, కన్వీనర్, పౌర సంక్షేమ సంఘం

ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన



ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రఘువీర్‌విష్ణు

కాకినాడ రూరల్: స్థానిక ఈశ్వర్‌నగర్‌లోని మోహన్ విద్యాసంస్థలలో ట్రాఫిక్‌పై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ రఘువీర్‌విష్ణు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు, ఎలిమెంట్ గురించి, విద్యార్థులకు వివరించారు. మీరందరూ మీ తల్లిదండ్రులకు, చుట్టు పక్కల ఉన్న వారికి ట్రాఫిక్ నియమ నిబంధనలను గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక శ్రద్ధ వహించి రోడ్లపై ప్రమాదాలు జరగకుండా తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్–1 సీఐ ఎన్.రమేష్, ట్రాఫిక్–2 సీఐ డి.రామారావు, విద్యాసంస్థల చైర్మన్ ఎం.మోహన్, డైరెక్టర్ ఎం.వెంకటేష్, ప్రిన్సిపాల్ రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా నగర సంకీర్తన



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్: సూర్యారావు పేట దూసర్లపూడి వారి వీధిలోని భోగిగణపతి పీఠంలో విఘ్నరాజ సంకష్ట హర చతుర్థి నిర్వహించారు. కాణిపాక గణపతి చిత్ర పటంతో మంగళ వాయిద్యాల నడుమ చతుర్థి ఉపవాసం చేపట్టిన ఆరాధకులు నగర సంకీర్తన చేశారు. పసుపు విఘ్నేశ్వరునికి అర్చన శ్రీవారి 50వ జపయజ్ఞ పారాయణ పంచామృతాభిషేకం నిర్వహించారు. 108 వారాల జపయజ్ఞ పారాయణ పూర్తి చేసి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దివ్యకల్యాణం తిరుమల బస్సుయాత్రలతో పరిపూర్ణం అవుతుందని గణపతిపీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు తెలిపారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ గ్రామం వద్ద శనివారం రాత్రి ట్రావెల్ బస్సు ఢీకొనడంతో ఎస్.అచ్యుతాపురం గ్రామానికి చెందిన సెంట్రింగ్ మేస్త్రి ద్రాక్షరపు కృష్ణ (48) మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం వీరబాబు కొవ్వాడ నుంచి మోటారు సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా ట్రావెల్ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదం గురించి తెలుసుకున్న వారంతా విషాదంలో మునిగిపోయారు. ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురజాడ అప్పారావు సేవలు మరువలేనివి



గురజాడ అప్పారావు నివాళులరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్ సగిలి



గురజాడ అప్పారావుకు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): సమాజంలో దురాచారాలను రూపుమాపేందుకు విశేష కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు అని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. గురజాడ 162వ జయంతిని శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాల్య వివాహాలు, కన్యాశుల్కం, మూఢ నమ్మకాలు వంటి దురాచారాలను నిర్మూలించేందుకు గురజాడ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ తిప్పేనాయక్ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో తెలుగు జాతి గర్వించదగ్గ కవి గురజాడ అప్పారావు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత గురజాడ చిత్రపటానికి సాహిత్యవేత్త డాక్టరు వేదుల శిరీష, అడబాల రత్నప్రసాద్, రాజా, రాఘవరావు, సత్యనారాయణ తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా 'కోస్టల్ సాగర్ సురక్షిత సాగర్'



సాగరతీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న దృశ్యం

కాకినాడ రూరల్: అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవ సందర్భంగా ఇండియన్ కోస్ట్ గార్డ్ ఆధ్వర్యంలో కోస్టల్ సాగర్ సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో ఇంటర్నేషనల్ కోస్టల్ కార్యక్రమానికి ఓఎన్‌జీసీ, రిలయన్స్, ఈకో, ప్లాస్టిక్ ,ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, రోటరీ క్లబ్, అభాని, జెమిని, కోరమండల్, సీ పోర్ట్, ధరిత్రి రక్షిత సమితి సంఘం సభ్యులు ముఖ్య అతిథులుగా విచ్చారు. వివిధ కంపెనీల ప్రతినిధుల ఉద్యోగులచే ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఫ్లాగ్ అప్ చేసి బీచ్‌ను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి భారతీయులకు భూ మాతపై అపరిమితమైన గౌరవం ఉందన్నారు అయితే నేడు భూమి, సముద్రం , ప్రకృతిపై ప్రజల్లో గౌరవం తగ్గుతుందని ఆయన అన్నారు. సముద్రాలు గతంలో కంటే వేగంగా క్షీణిస్తున్నాయి, అందువల్ల మనం సముద్రాలను కాపాడుకోవడం అత్యవసరమని చెప్పారు. ఇప్పటికే ప్లాస్టిక్ వాడకం వల్ల ఋతుపవనాల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని ప్లాస్టిక్ వల్ల భూమి మాత్రమే కాదు మహాసముద్రాలు కూడా ప్లాస్టిక్ మయంగా మురికితో నిండిపోయాయని విచారణ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు, కోస్ట్ గార్డ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కాస్మోపాలిటన్ క్లబ్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కాకినాడ: స్థానిక ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలకు చెందిన 1975–78 బీకాం పట్టభద్రుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్ ఆవరణలో నాలుగు దశాబ్దాల తరువాత కలుసుకుని గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు పరిచయాలు చేసుకుని అనుభవాలను పంచుకున్నారు. కొద్దిసేపు అహ్లాదంగా గడిపారు. వీరందరినీ ఒకచోటకు చేర్చిన మిత్రులు కృష్ణగోపాల్, తెలగారెడ్డి సత్యానందంలకు మిగిలిన సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.


నృత్యంతో శారీరక, మానసిక ఆరోగ్యం



నాట్యగురువు కల్యాణిని సత్కరిస్తున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: పిల్లలకు బాల్యం నుంచే శాస్త్రీయ సంగీతం, నృత్యం నేర్పించడం వల్ల మానసికంగాను, శారీరకంగాను బలంగా తయారవుతారని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అద్దాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న శ్రీసత్య దంత వైద్యశాలలో శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ నృత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నృత్యం సరిహద్దులు, సంస్కృతులు, భాషలకు అతీతమన్నారు. ఇది భావోద్వేగాలు, సంప్రదాయాల వ్యక్తీకరణకు రూపమన్నారు. ఇది అన్ని వర్గాల ప్రజలను కలిపే వారధిగా పనిచేస్తుందని తెలిపారు. మన కట్టుబాట్లు మన సంస్కృతులను పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించినట్లయితే వారు భవిష్యత్తుకు బంగారు బాట వేసిన వాళ్లమవుతామన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నాట్య గురువు కల్యాణిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన భారతీయ సంప్రదాయంలో శాస్త్రీయ నృత్యం చాలా ముఖ్య భూమిక పోషిస్తుందని, తల్లిదండ్రులందరూ పిల్లలకు నృత్యం నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అద్యక్షుడు నాగేంద్ర సభ్యులు, పద్మావతి చైతన్య, భవాని పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి

బోట్‌క్లబ్: రాష్ట్రానికి తలమానికంగా ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ పరిశ్రమ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించడానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఏపీ అసెంబ్లీలో విశాఖ స్టీలు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. ప్రైవేటీకరణ ఆపాలని గత 1315 రోజులుగా విశాఖనగరంలోను, రాష్ట్రంలోను పోరాటం సాగిస్తున్న ప్రజాభిప్రాయాన్ని పెడచెవిన పెడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రైవేటు వ్యక్తులకు ఈ ఫ్యాక్టరీ కట్టబెట్టేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. ఇప్పటికే పలువురు ఉద్యోగులను వీఆర్ఎస్ పేరుతోను, డిప్యూటేషన్ పేరుతో బయటకు నెట్టే ప్రక్రియ ప్రారంభించారన్నారు. ఈ ఫ్యాక్టరీలకు గనులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం విశాఖ ఫ్యాక్టరీకి మాత్రం సొంత గనులు కేటాయించలేదన్నారు. అక్టోబర్ రెండు నుంచి కాకినాడలో నిరసన దీక్షలు చేయనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, నగర కన్వీనర్ మలకా వెంకటరమణ , కో కన్వీనర్ పలవెల వీరబాబు పాల్గొన్నారు.

రాత పరీక్ష వెంటనే నిర్వహించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నిరుద్యోగులు

బోట్‌క్లబ్: రాష్ట్రంలో 6100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు నిర్వహించిన నోటిఫికేషన్ వెంటనే పూర్తి చేయాలని డిమోక్రాసియూత్ ఆఫ్ ఇండియా(డీవైఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ శనివారం నిరుద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేశారు. కానిస్టేబుల్ ప్రాథమిక రాత పరీక్షలో 95,208 మంది అర్హత సాధించారన్నారు. వీరికి తర్వాత జరగాల్సిన దేహదారుఢ్య పరీక్ష, మెయిన్స్ రాత పరీక్షలు ఇప్పటి వరకూ నిర్వహించలేదన్నారు. కూటమి ప్రభుత్వం తమకు ఏదో న్యాయం చేస్తుందని ఓట్లు వేస్తే నాలుగు నెలలు గడుస్తున్నా ఈ విషయం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పాండవులు దుర్గాప్రసాద్, అభ్యర్థులు పాల్గొన్నారు.

డీజిల్ ట్యాంకర్ సీజ్

కాకినాడ రూరల్: యానాం నుంచి డీజిల్‌ను అక్రమంగా తరలిస్తున్న ట్యాంకర్‌ను రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కరప మండలం ఉప్పలంక వద్ద డీజిల్ ట్యాంకర్‌ను వారికి అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, కరప రెవెన్యూ సిబ్బంది తనిఖీ చేయగా బిల్లులు లేనట్టు గుర్తించారు. దీంతో ట్యాంకర్‌లో రూ.11.07 లక్షల విలువైన 12 వేల లీటర్ల డీజిల్‌ను, రూ.12.57 లక్షలు విలువైన ట్యాంకర్‌ను సీజ్ చేసి కరప పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆర్‌వీఎన్ మూర్తి తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.